# పిరికివాడు

మధుసూదనం అదృష్టవంతుడని అందరూ అంటారు. అతనికి అందమైన భార్య, బల్బుల్లాంటి పిల్లలూ, కావల్సినంత ఆస్తి, బ్యాంకులో ఆఫీసరు ఉద్యోగం ఉన్నాయి. కానీ అందరి అభిప్రాయంతో మధుసూదనం ఏకీభవించడు.

"నువ్వు అదృష్టవంతుడివోయ్" అని అతనితో ఎవరైనా అంటే పైకి నవ్వేసినా మనసులో మాత్రం హు... అదృష్టం అంటే ఏమిటి అని అనుకుంటాడు తను అదృష్టవంతుడని అందరూ చెప్పుకోడానికి ఉన్న కారణాలు మరి కొన్ని రెట్లు పెరిగినా మధుసూదనం తను అదృష్టవంతుడిగా ఒప్పుకోడు. అతని మనసు చాలాకాలంగా అశాంతితో నిండి ఉంది. మనసుకు శాంతిలేనప్పుడు ఎన్నిఉంటే ఏం లాభం?... అందుచేత తను అదృష్టవంతుడు ఎలాగవుతాడు,

"అసలు అదృష్టమంటే ఏమిటి?.,," అని తనను తాను ప్రశ్నించుకుంటే అది రాజమ్మ కౌగిలి అనే సమాధానం ఒక్కటే అతని మనసుకు తడుతుంది. మధుసూదనం తనకున్న వాటన్నిటికంటే రాజమ్మ కౌగిలికి ఎక్కువ విలువ ఇచ్చాడు గాబట్టి రాజమ్మెవరో స్వర్గలోకంలో ఉండే దేవతనుకుంటే అది పొరబాటే అవుతుంది. మధుసూదనం మాత్రం రాజమ్మని అంతకంటే ఎక్కువే అనుకుంటాడు.

రాజమ్మతో అతనికి పరిచయం పధ్నాలుగేళ్ళ క్రితం

జరిగింది. అప్పుడు మధుసూదనం తన కాలేజీ చదువు పూర్తిచేసి ఇంటిపట్టునే ఉండేవాడు. ముత్తమ్మ వాళ్ళింటో పనిమనిషి. ఒకరోజు ముత్తమ్మ బదులు ఒక పదహారేళ్ళపిల్ల వాళ్ళింట్లో పనిచెయ్యడానికి వచ్చింది. బెదిరే లేడికళ్ళు ఎలా ఉంటాయో మధుసూదనం చూడలేదుగానీ ఆ అమ్మాయిని చూసినతరువాత ఆ అమ్మాయి కళ్ళలా ఉంటాయేమో అని అనుకున్నాడు. ఆపిల్లను చూసిన ఎవరికైనా ఆమెకు పదహారేళ్ళు అంటే నమ్మకం కుదరదు. ఆ అమ్మాయి వయసు ఇరవై అయిదులా అనిపిస్తుంది మధుసూదనం ఆ అమ్మాయి వేసుకునేంత బిగుతైన జాకెట్టు ఎప్పుడూ చూడలేదు. రాక్వెల్ వెల్ష్ ఆఅమ్మాయి గుండెల్ని చూస్తే తన గుండెలు బాదుకుంటుంది.

ఆ అమ్మాయే రాజమ్మ!!

''ఈవేళ పన్లోకి నువ్వొచ్చావేమే?'' అని మధుసూదనం తల్లి అడుగుతే,

"ఈయాల్టినుండి నేనే వొత్తానమ్మగోరూ... మా యమ్మకు ఒంటో బావుండటంలేదు...'' అని సమాధానం ఇచ్చింది రాజమ్మ.

మాటల్లో యాస ఉన్నా గొంతులోని తీయదనం ఎక్కడికి పోతుంది..అనుకున్నాడు మధుసూదనం. ఈమె ఆ కాలంలో ఉండి ఉంటే రాజులు రాజ్యాలు వదిలేసి ఈమెకోసం యుద్ధాలుచేసి ఉండేవారని కూడా మధుసూదనం అనుకున్నాడు. రాజమ్మ నీళ్ళబిందె మోస్తున్నప్పుడు ఆమె నడుముమీదపడే మడత మధ్యలో ఓచిన్న కీటకమై నలిగి చచ్చిపోతే స్వర్గానికి పోతానేమో అని చాలాసార్లు అనుకున్నాడు.

ఆమె మెడమీంచి గుండెలలోతుల్లోకి జారిపోయే స్వేదబిందువు తనకంటే గొప్పదని మధుసూదనం భావిస్తాడు. ఇంతెందుకు, రాజమ్మ మధుసూదనం మనసును పూర్తిగా ఆక్రమించేసిందనే చెప్పాలి.

రాజమ్మగురించి వెంకటేశానికి చెప్తే వాడు ఫక్కున నవ్వేశాడు.

"అయితే చూసి చూసి ఓ పనిమనిషిని ప్రేమించావన్నమాట?" అని తేలిగ్గా మాట్లాడేడు. అప్పుడు మధుసూదనానికి చాల కోపం వచ్చింది. అంతకోపం దూర్వాసుడికూడా ఎప్పుడూ వచ్చిఉండదు. మధుసూదనానికే గనుక తపోశక్తి ఉండివుంటే ఆ క్షణంలో వెంకటేశం మాడి మసైపోయుండేవాడు.

"ఏం?...పనిమనిషైతే మాత్రం దానికేం తక్కువని?... ఒక్క చదువులేదేమో!!...రాజమ్మకి లేనిది, ఈక్లాస్ గర్ల్సుకి ఉన్నది ఏమిటి?... రాజమ్మకున్న పర్సనాలిటీ ఈ కాలేజీ అమ్మాయిల కెక్కడిది?... సన్నగా మెడమీద ఎముకలతో, చేతులమీద పచ్చగా నరాలతో, అదే నాజూకుదనంగా భావిస్తూ లేని వయ్యారం తెచ్చుకుని... ఛీ ఛీ... రాజమ్మెక్కడా వాళ్ళెక్కడా?."

మధుసూదనం వెంకటేశంతో మాట్లాడడం మానేశాడు. మధుసూదనానికి ప్రొద్దున్న లేస్తే రాజమ్మ దర్శనమే అయ్యేది. కళ్ళు తెరవగానే మోకాళ్ళపైకి చీరకట్టి వంగి గది ఊడుస్తూ రాజమ్మ కనిపించేది. వంగి ఊడుస్తూ

న్నప్పుడు సగం సగం కనిపించే రాజమ్మ గుండెలూ, నడుం మీది మెత్తని మడతలూ వీపుమీది లోతైన గీతా, రాజమ్మ పిక్కలూ చూసిన తరువాతే అతను మంచంమీదినుంచి లేచే వాడు. రోజు రోజుకి అతనికి రాజమ్మమీద వ్యామోహం పెరిగి పోసాగింది. కుష్టువ్యాధి వేళ్ళను తినేసినట్టు రాజమ్మ అందం అతని గుండెల్ని తినేయసాగింది.

రాజమ్మ మధుసూదనాన్ని చూసినప్పుడు సిగ్గుపడి తల వంచుకునేది ఆమె ఓరగా చూస్తూ నవ్వినపుడు మేనకవల్ల విశ్వామిత్రుడి తపస్సు ఎలా భంగపడిందో అర్థమయినట్టు అని పించేది. ఏది ఏమయినా రాజమ్మ లేని జీవితం సూర్యుడులేని ప్రపంచం అనిపించింది మధుసూదనానికి. ఆమె పొందుకోసం తహతహ లాడిపోయాడు. ఒకటి రెండుసార్లు ధైర్యంచేసి ఎవ్వరూ చూడకుండా రాజమ్మ చెయ్యిపట్టుకున్నాడు. అప్పుడు రాజమ్మ బెదిరిపోతూ చూసిన చూపు మధుసూదనం ఈజన్మలో మర్చిపోలేడు- "ఏటండి బాబూ...ఎవరైనా సూత్తే?..." అని చెయ్యి విడిపించుకుని అంతలోనే నవ్వేసి గిరుక్కున వెనక్కి తిరిగి పారిపోయింది ఆ రెండుసార్లూ. రాజమ్మ కౌగిలిలో కరిగే అదృష్టం తన కుందో లేదోనని ఆవేదన పడ్డాడు మధుసూదనం.

కానీ అతని కోరిక అంత త్వరలోనే తీరుతుందని మధు సూదనం ఊహించనేలేదు. ఆ రోజు సాయంత్రం ఊరవతల పొలం గట్లమ్మట షికారెళ్తుంటే అతనికి రాజమ్మ ఇంటికి వెళ్తూ ఎదురుపడింది. రాజమ్మను చూసి మధుసూదనం, అతన్ని చూసి రాజమ్మా ఇద్దరూ ఆగిపోయారు. ఆ సాయంకాలపు నీరెండలో రాజమ్మ రూపం అతన్ని పిచ్చివాడిని చేసింది.

"ఎక్కడికి రాజమ్మా..." అన్నాడు చివరికి ఈలోకంలో పడుతూ.

"ఇంటికి" తలవంచుకుంది రాజమ్మ. ఆమె కళ్ళల్లో ఎన్ని కలలు! గుండెల్లో ఎన్నెన్ని కోర్కెలు!!

"ఎక్కడినుండి వస్తున్నావ్?..." తను వేసినప్రశ్న తనకే చప్పగా అనిపించింది.

"ఇల్లి పొరుగూరులో మా అప్పుంది. దావికాడికెల్లి వత్తున్నా" అంది నేలచూపులు చూస్తూ.

"కాస్సేపు కూర్చుని కబుర్లు చెబుదూ...ఏమీ తోచడం లేదు" అన్నాడు పొలం గట్టుమీద కూర్చుంటూ.

"అమ్మో...నా నింటికి పోవాల" అంది కళ్ళు పెద్దవి చేసి చూస్తూ.

ఆ నిర్మానుష్య స్థలంలో మధుసూదనానికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. దానికితోడు మతి పోగొట్టే రాజమ్మ అందం తోడైంది. చటుక్కున రాజమ్మ చేయిపట్టుకుని క్రిందికి లాగి పొలంగట్టున కూర్చోబెట్టాడు.

"అప్పుడే ఇంటికి వెళ్ళి ఏంచేస్తావ్?"

రాజమ్మ ముడుచుకుపోయింది. కాస్సేపు రాజమ్మ మధుసూదనం పాదాల్ని, అతను రాజమ్మ గుండెల్ని చూస్తూ మౌనంగా కూర్చున్నారు.

"రాజమ్మా...నువ్వు చదువుకుంటావా...?" అన్నాడు హఠాత్తుగా మధుసూదనం.

గలగలపారే సెలయేరులా నవ్వింది రాజమ్మ.

"చెప్పు రాజమ్మా..."

సెలయేటి ప్రవాహం నిలిచిపోయింది.

"నాకు సదువేటి బాబూ...అయినా నాకు సదువు సెప్పే మాట్టరెవరండి బాబూ..." అంది

"నేనున్నానుగా!..."

"అమ్మో...అమ్మగారు సంపేత్తారు..." కళ్ళు పెద్దవి చేసింది రాజమ్మ.

మళ్ళీ మౌనం...చూపులు...మధుసూదనం పాదాలు... రాజమ్మ గుండెలూ...

"ఇక నేనెల్లిపోతాను" అని రాజమ్మ లేవబోయింది. మధుసూదనం చేతులు రాజమ్మ భుజాలు పట్టుకున్నాయి.

"ఇంకాస్సేపుండు రాజమ్మా!..." అన్నాడు దీనంగా రాజమ్మ కళ్ళల్లోకి చూస్తూ.

అతని ముఖం చూసిన రాజమ్మ పైకి లేవలేకపోయింది. ఆ సమయంలో అతన్ని ఒడిలో పడుకోబెట్టుకుని లాలించాలని పించింది రాజమ్మకు.

"అమ్మ నాకోసం సూత్తుంటాది..." అన్నది రెప్పలు టపటపలాడిస్తూ పూలమీద వాలి మూసి తెరిచే రంగు రంగుల సీతాకోక చిలుకల రెక్కలు గుర్తుకొచ్చాయి మధుసూదనానికి.

"ఇంకాస్సేపే..." మారాం చేశాడు మధుసూదనం.

"సీకటడిపోతున్నాది" రాజమ్మ హెచ్చరిక.

"ఏం భయమా?..."

అవునన్నట్లు తలూపింది రాజమ్మ.

"ఇంటిదాకా నేను తోడువస్తానుగా..."

"అమ్మో!!..."

మధుసూదనం రాజమ్మ భుజాల మీద చేతులు వేసి దగ్గరకు లాక్కున్నాడు. రాజమ్మ విడిపించుకునే ప్రయత్నం చెయ్యలేదు. అతని గుండెలమీద వాలిపోయింది ఆ బయలులో, సందె చీకటిలో, ప్రకృతి ఒడిలో ఆడదానిదగ్గర ఎంతటి సుఖం దొరుకుతుందో మొట్టమొదటిసారిగా రాజమ్మవల్ల తెలుసుకున్నాడు మధుసూధనం.

అవి మొదలు రాజమ్మా, మధుసూదనం ప్రతిరోజూ సాయంత్రం ఊరిబయట ఆ మైదానంలో కలుసుకోసాగారు. మధుసూదనం రాజమ్మను నిజంగా ప్రేమించాడు గానీ రాజమ్మను పెళ్ళిచేసుకోవాలన్న ఆలోచన అతనిలో మొట్ట మొదటసారి కలిగినప్పుడు అతను వొణికిపోయాడు. తనేదో పెద్ద పాపంచేస్తున్నట్లు మధనపడ్డాడు. ఆ ఆలోచన వచ్చింది మొదలు అతనికి మనశ్శాంతి కరువైంది. రాజమ్మను ముట్టుకోవాలంటేనే భయంవేసేది. రాజమ్మ కళ్ళలోకి సూటిగా చూడలేకపోయేవాడు

తరువాత కొన్నాళ్ళకి మధుసూదనానికి హైదరాబాదులో బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. అతను హైదరా

బాదు వెళ్ళే ముందురోజు సాయంత్రం రాజమ్మని మైదానంలో కలుసుకున్నాడు. రాజమ్మ కంట తడిపెట్టింది. ఆమె కంట తడి మధుసూదనం గుండెలమీద చొక్కాలో ఇంకి పోయింది. రాజమ్మ మధుసూదనంతో ఒక్క మాటైనా చెప్పలేదు. తనను మర్చిపోవద్దని గానీ, అప్పుడప్పుడూ ఆ వూరికి వస్తూండమని గానీ ఏమీ చెప్పలేదు కాని ఒక్కటంటే ఒక్కటే మాట చెప్పింది.

"నాను నెలతప్పినాను మధు బాబూ..." అంది. మధుసూదనం ఉలిక్కిపడ్డాడు.

హైదరాబాదు వెళ్లేముందు తనివితీరా ఆ రాత్రి, ఆ మైదానంలో రాజమ్మతో ఆనందం పంచుకుందామని ఆశగా వచ్చిన అతనికి రాజమ్మ చెప్పిన వార్త చాలా ఘోరంగా కనిపించింది. అతి సాధారణమైన స్త్రీకి మల్లే రాజమ్మకి కడుపొస్తుందని అతను ఊహించలేదు. ఆకలికి భరించలేక ఒక తల్లి తన కన్న కొడుకునే చంపి తింటే ఎంత ఘోరమో అంత కన్నా ఘోరాతి ఘోరంగా అనిపించింది అతనికి రాజమ్మ విషయం. మధుసూదనం చాలా కృంగిపోయాడు. ఆ క్షణంలో రాజమ్మ తన ఎదురుగా నిలుచుని ఉండటమే భరించలేక పోయాడు. అతనికి ఏం మాట్లాడాలో తోచలేదు. ఇద్దరూ అలా మౌనంగా ఒక పావుగంటసేపు కూర్చున్నారు. రాజమ్మ నిశ్శబ్దంగా రోదించసాగింది.

"నీకేం భయంలేదు రాజమ్మా..." అన్నాడు, మధుసూదనం చివరకు. అలా అంటున్నప్పుడు అతనిగొంతు

వొణికింది. అసలు తనామాట ఎందుకన్నాడో తనకే అర్థం కాలేదు.

రాజమ్మను రెండుచేతుల్లోకి తీసుకొని నొసలు ముద్దు పెట్టుకున్నాడు. అంత వరకూ దుఃఖాన్ని అపుకుంటున్న రాజమ్మ ఒక్కసారిగా భోరుమంది. ఆమె చేతులు మధుసూద నాన్ని కౌగలించుకున్నాయి మధుసూదనం కళ్ళల్లో రెండు కన్నీటి బిందువులు నిలిచాయి.

హైదరాబాదు వెళ్ళిన తరువాత మధుసూదనాన్ని రాజమ్మ ఆలోచనలు తరిమి తరిమి వెంటాడి అతనికి మన శ్శాంతి లేకుండా చేశాయి. మనశ్శాంతి మనిషికి ఎంతటి వరమో అతనికి అప్పుడు అర్థం అయింది డబ్బులేకపోయినా ఆనందంగా బ్రతకవచ్చు నేమోగాని మనశ్శాంతి లేకపోతే బ్రతకడమే కష్టమని అనుకున్నాడు. "నీకెం భయంలేదు రాజమ్మా... నేను నిన్ను పెళ్ళిచేసుకుంటానని" తను ఎందు కనలేకపోయాడు?... ఈ ఆలోచన వచ్చినప్పుడు అతనికి మొట్టమొదటిగా తన తల్లితండ్రులమీద, తరువాత అచారాల మీద, కుల మతాలమీద, తరువాత ఈ సంఘంమీద చెప్పలేనంత కోపం వచ్చింది. అసలు ఈ ప్రపంచంలో తనూ, రాజమ్మా తప్ప మరెవ్వరూ లేక పోతే ఎంత బావుండేది... అని అను కుంటుండేవాడు.

హైదరాబాదులో అలా ఒక ఆరునెలలు గడిపేశాడు మధుసూదనం. అతనికి ఈ ఆరునెలలు ఆరు కోట్లసార్లు రాజమ్మ గుర్తుకు వచ్చింది. ఎక్కడ చూసినా రాజమ్మే కనపడసాగింది అతని ప్రతి ఆలోచనలోనూ రాజమ్మే...

రాజమ్మ! రాజమ్మ! రాజమ్మ!!!...

అతనికి ప్రతిసారీ హైదరాబాదు తను వచ్చేముందు దీనంగా కన్నీళ్ళతో నిలబడ్డ రాజమ్మ రూపమే గుర్తుకువచ్చి అశాంతితో గిలగిల్లాడిపోయాడు. ఒక వారం రోజులు శలవు పెట్టి ఇంటికి బయలుదేరాడు మధుసూదనం. ఇంటిలో అడుగు పెడుతూనే అతను రాజమ్మకోసం గాలించాడు. నూతిగట్టు మీద పనిపిల్ల అంట్లు తోముతూ కనబడింది. అది రాజమ్మ కాదు!!!...

రాజమ్మ గురించి తల్లిని అడిగాడు.

"పాపం... దాన్నెవడో మోసం చేశాడురా!... నెల తప్పింది. ముత్తమ్మ దాన్ని కర్రతో గొడ్డును బాదినట్టు బాదినా అది వాడిపేరు చెప్పలేదు అసలు అంతటి అమాయకురాలికి అన్యాయం చెయ్యడానికి ఆ పాపిష్టి వెధవకి మనసెలా ఒప్పిందో?!..." అంది.

తనే ఆ వెధవని, రాజమ్మకి తను అన్యాయం చెయ్యదలుచుకోలేదనీ, రాజమ్మను పెళ్ళి చేసుకుంటానని అమ్మతో చెప్పితే ఆమె ముఖంలో రంగులు ఎలా మారతాయో చూద్దామనిపించింది అతనికి ఆక్షణంలో.

"రాజమ్మ ఎక్కడుంది?..."

"పురుడికి వాళ్ళ అమ్మమ్మ వాళ్ళ ఊరు వెళ్ళింది... పాపం ముత్తమ్మ ఈ మధ్యనే చచ్చిపోయింది..."

"అయితే రాజమ్మ మళ్ళీ ఈ ఊరు రాదా?..."

"ఎందుకు రాదూ?... వాళ్ళ అయ్యున్నాడుగా.?"

మధుసూదనం ఆ వారం రోజులూ అశాంతితో గడిపాడు. ఇంటిపట్టునే ఉన్నాడు అక్కడఉన్నన్ని రోజులూ.

మరుసటి సంవత్సరం మధుసూదనం పెళ్ళయిపోయింది. పెళ్ళి చూపులప్పుడు "అమ్మాయి నచ్చిందా?..." అని తల్లి దండ్రులడిగితే

''లేదు...రాజమ్మలా లేదు" అందామనుకున్న అతను ఏమీ అనలేక తలపైకీ క్రిందకీ ఊపాడు.

తన భార్య అరుణతో అతనికి మొదటిరాత్రప్పుడు రాజమ్మతో తను మొదటిసారిగా ఊరిబయట పచ్చికబయలులో గడిపిన మధురక్షణాలే గుర్తుకు వచ్చాయి.

అప్పుడప్పుడూ అరుణను మధుసూదనం ''రాజా" అని పిలిచేవాడు. అప్పుడామె అమితంగా పొంగిపోయేది. మధుసూదనం తను ఊరిబయట రాజమ్మ సుఖాన్ని అనుభవిస్తున్నప్పుడు ఆమెను అలానే మెల్లగా చెవిలో గుసగుస లాడుతూ పిలిచేవాడు. ఆ విషయం అరుణకు తెలిస్తే అలా పొంగి పోగలదా?...

అరుణతో మధుసూదనం శారీరకంగా మాత్రమే సంసారం చేస్తున్నాడు. అతని మనసంతా రాజమ్మమీదే. ఒకనాడు రాజమ్మ తండ్రికూడా చచ్చిపోయినట్టు అతనికి ఆ ఊరి మనిషి ద్వారా తెలిసింది. మధుసూదనం గిలగిల లాడిపోయాడు. ఇప్పుడు రాజమ్మ ఎలా ఉందో!!... ఒంటరిగా—చంటిపిల్లవాడితో!!...

రెండు రోజులు శలవుపెట్టి అరుణను తీసుకుని ఇంటికి బయలుదేరాడు. రాజమ్మ నాలుగిళ్ళలో పాచిపని చేసుకుని బ్రతుకుతుందని తల్లి ద్వారా తెలుసుకున్నాడు మధుసూదనం ఆ రోజు రాత్రే రాజమ్మ ఇంటికి బయలుదేరాడు కానీ దారి లోనే ఎక్కడికో వెళ్తూ రాజమ్మ మధుసూదనానికి ఎదురుపడింది. రాజమ్మలో శారీరకంగా మార్పేమీలేదు.

"బాగున్నావా రాజమ్మా?..." అని అడిగాడు మధుసూదనం. కానీ వెంటవే అది తను వెయ్యాల్సిన ప్రశ్న కాదనిపించింది అతనికి.

రాజమ్మ ఏమీ సమాధానం చెప్పలేదు. ఒక్కసారి తలెత్తి కొన్నిక్షణాల పాటు మధుసూదనం వంక చూసింది. ఆ చూపులో ఏ భావమూలేదు. మధుసూదనం ఆ చూపును భరించలేక తలదించుకున్నాడు.

"చాల పొరపాటైపోయింది రాజమ్మా..."

మళ్ళీ తనే అన్నాడు.

ఎదురుగా చూస్తే రాజమ్మ లేదు. ఆమె అప్పుడే ప్రక్కనున్న సందులోకి మళ్ళిపోయింది, రాజమ్మ చంకలో ఉన్న పసిబిడ్డ ముఖంచూసే అవకాశం అయినా తనకు కలగనందుకు మధుసూదనం బాధపడ్డాడు.

వాడు తనకొడుకు!... విరక్తిగా నవ్వుకున్నాడు.

తరువాత మళ్ళీ అతను రాజమ్మను కలుసుకోవాలని ప్రయత్నించలేదు. కాని రాజమ్మ జ్ఞాపకాలు మాత్రం అతన్ని పీడించసాగాయి.

మధుసూదనానికి ఇద్దరు పిల్లలు కలిగారు. అతను బ్యాంకులో ఆఫీసరైనాడు. ఇల్లు కొన్నాడు. కారుకొన్నాడు. రాజమ్మను మరింతగా గుండెలో నింపుకున్నాడు. అందుకే అతనికి మనశ్శాంతి లేకుండాపోయింది. రాజమ్మ బ్రతుకు అలా అడవి కాచిన వెన్నెల అయిపోవలసిందేనా?...జీవితాంతం మోడులా బ్రతకవలసిందేనా?... ఆమెను ఎవరు పెళ్ళి చేసుకుంటారు? రాజమ్మను తనే చేసుకోలేదు. ఇంక అటువంటప్పుడు పెళ్ళికాకుండా బిడ్డ తల్లి అయిన రాజమ్మను ఇంకెవరు చేసుకుంటారు??... ఈ విషయమై మధుసూదనం చాల మధన పడ్డాడు.

ఆ రోజు ఊరినుండి అమ్మ వస్తూనే చెప్పిన వార్తవిని మధుసూదనం మనసు చివుక్కుమంది.

"రాజమ్మ పెళ్ళి చేసుకుందిరా..."

"ఏ రాజమ్మ?..." అని అడిగాడు నమ్మకం కుదరక.

"ఇంకే రాజమ్మ... మన రాజమ్మే... మన ఊళ్ళోనే షావుకారు కొట్టులో బియ్యం బస్తాలు మోసే కోటయ్యను పెళ్ళి చేసుకుంది... కోటయ్య చాల మంచివాడురా...దాని సంగతి తెలిసే చేసుకున్నాడు. చాల బాగా చూసుకుంటాడట. రాజమ్మ చెప్పింది..."

"అరుణా! స్నానానికి నీళ్ళు పెట్టు..." అంటూ తువ్వాలు భుజంమీద వేసుకుని తల్లి చెప్పే మాటలు పూర్తిగా వినకుండా బాత్రూములోనికి వెళ్ళిపోయాడు మధుసూదనం.

రాజమ్మ పెళ్ళి చేసుకుందంటే నమ్మకం కుదరడం లేదు.

ఆ భావం అతనిలో అంతులేని అసంతృప్తిని రేపింది. ఇన్నాళ్ళూ రాజమ్మకి పెళ్ళి కాదేమోనని బాధపడిన తనే రాజమ్మ పెళ్ళి వార్త విని బాధపడ్డాడు.

రాజమ్మ తనకు దక్కకుండా పోయింది... కనీసం రాజమ్మ జ్ఞాపక చిహ్నంగా రాజమ్మకు తనవల్ల పుట్టిన ఆ బిడ్డను తెచ్చి పెంచుకుంటేనో?... అవును... వాడిని తెచ్చి పెంచుకోవాలి!... వాడు తన కొడుకు... వాడు కోటయ్యలా బస్తాలు మోసే వాడిలా తయారు కాకూడదు... మరి అరుణకు ఏమని సమాధానం చెప్పాలి?...

ఈ ఆలోచనతో మధుసూదనం వేడి చల్లారిపోయింది. రాజమ్మ విషయంలో తను ఆశక్తుడవడం అతన్ని అమితంగా కృంగదీసింది. అతను పగలూ రాత్రీ రాజమ్మ జ్ఞాపకాలతోనే బతికాడు. ఏనాడైనా అతను నవ్వుతూ గడిపేడంటే ఆ రోజు అరుణకు పండగే.

అలా పధ్నాలుగేళ్ళు మనశ్శాంతి లేకుండా గడచి పోయాయి. సంక్రాంతి పండక్కు రావలసిందిగా తండ్రి దగ్గర నుండి ఉత్తరం వస్తే రెండు వారాలు శలవుపెట్టి అరుణా పిల్లలతో సహా ఊరికి బయలుదేరాడు మధుసూదనం. రెండు రోజులు సరదాగానే గడచి పోయాయి. మూడో రోజు ఒక్కడే అలా షికారుకి వెళ్ళాడు మధుసూదనం. తనకు తెలీకుండానే ఊరిబయట ఆ మైదానం వరకూ వెళ్ళిపోయాడు. అక్కడి ప్రతి చెట్టు, పుట్టా రాజమ్మను గుర్తుకుతెచ్చింది పాత జ్ఞాపకాలు అతన్ని బాధించసాగాయి. అలానే తలపట్టుకుని అక్కడే కూర్చుండిపోయాడు. అలా ఎంతసేపు కూర్చున్నాడో అతనికే

తెలీదు. ఏదో నిర్ణయించుకున్న వాడిలా హఠాత్తుగా లేచి నిలబడ్డాడు.

"రాజమ్మను కలవాలి... తనకొడుకుని తనకు ఇచ్చేయమని చెప్పాలి. వాడిని బాగా చదివించి పెద్దవాడిని చెయ్యాలి. ఏ అరుణా తనను ఆపలేదు... తన నిర్ణయానికి తిరుగులేదు అనుకున్నాడు. అప్పుడే మెల్లమెల్లగా చీకటి పడుతూంది. ఆలోచించి ఆలోచించి మధుసూదనం తల దిమ్మెక్కింది. అతను ఊరివైపు అడుగులు వేశాడు తల దిమ్ము తగ్గడానికి వేడివేడి టీ తాగాలని హోటల్లోకి దూరాడు మధుసూదనం.

టీ తాగి టేబులు మీద కప్పు పెట్టగానే ఆ కప్పు తీసేసి బల్లను తడిగుడ్డతో తుడిచేసి వెళ్ళిపోయాడు ఒక క్లీనరు. వాడికి పదమూడు, పధ్నాలుగేళ్ళు ఉండొచ్చు. వాడిని చూడగానే మధుసూదనానికి వాళ్ళబ్బాయి రమేశ్ గుర్తుకు వచ్చాడు. రమేశ్ అంతా మధుసూదనం పోలికే. అతని మనసులో ఏదో కలవరం బయలుదేరింది. వాడిని పిలిచి వాళ్ళ అమ్మ పేరు అడుగుదామనుకొని మళ్లీ మానుకున్నాడు. హోటలులోంచి బయటపటిన మధుసూదనం తలదిమ్ము మరింత ఎక్కువయింది.

అక్కడ ఉన్నన్ని రోజులూ అ హోటలుకు మాత్రం వెళ్ళలేదు మధుసూదనం.

జూన్ 1979 యువ